అదృశ్య దీవి!

అజీజ్

"ఎమ్మల్సి ఎస్. పి. గారు పిలుస్తున్నారు సార్!" అన్నాడు డేవిడ్ లోనికి వచ్చి.

సిగరెట్ ఏష్ ట్రేలో నొక్కి లేచాను. ఏదో ముఖ్య విషయం లేనిదే ఆయన నన్ను పిలవడు.

స్ప్రింగ్ డోర్స్ తోసుకుంటూ లోన అడుగు పెట్టి, సెల్యూట్ కొట్టేను. ఆయన ప్రతివాదం జేసి "ప్లీజ్ టేక్ యువర్ సీట్!" అన్నాడు.

క్యాప్ తీస్తూ కుర్చీలో చతికిలబడ్డాను.

ఆయన సిగరెట్ అంటించి ప్రారంభించాడు. "నగరంలో అక్కడక్కడా వ్యాపించివున్న మన ప్రత్యేక నిఘా విభాగంవారు ఈమధ్య ఓ కొత్తరిపోర్టు పంపారు, నాకు.

ఆ రిపోర్ట్‌లోని విషయాలు చాలా అసక్తికరంగానూ, అనుమానాస్పదంగానూ ఉన్నాయి. అందుకే నిన్ను పిలిపించాను—తక్షణంగా నీచేత దర్యాప్తు జరిపించాలని!

ఈమధ్య సోమసుందరంపిళ్ళె వీధిలో ఓ ప్రయివేట్ సంస్థ తాలూకు 'అజన్మ యవ్వన కార్పొరేషన్' అనే కొత్త ఆఫీసు తెరవబడిందిట. ఆ పేరులోనే ఏదో అసహజత్వం కనిపిస్తోంది కదూ?

దాని యజమాని పేరు ప్రదీప్‌కుమార్ చక్రవర్తి.

కానీ, అతను తెరిచిన, ఆ కొత్త ఆఫీసులో, యీ మధ్య ఇక్కడ పేరుమోసిన రౌడీలు కొందరు వెళ్ళి వస్తూండటం మనవాళ్ళ కంటబడింది. తక్షణం రిపోర్టు పంపారు.

ముందే అనిశ్చితమైన యీనాటి రాజకీయ గొడవలతో తలమునకలౌతున్న మన ప్రజలకు ఆ వెధవలవల్ల మరేదయినా సంకటస్థితి దాపురించబోవటం లేదుకదా?

ఆ ప్రదీప్‌కుమార్ చక్రవర్తికి రౌడీలతోనూ, గుండాలతోనూ ఏమిటిపని? అతను చేసే వ్యాపారం యేమిటి? అజన్మ యవ్వన కార్పొరేషన్ యేమిటి? మొదలయిన సందేహాలకి నాకు సమాధానాలు కావాలి. నీవు వెంటనే రంగంలోకి దిగి, నిగూఢమైన విషయాలేవయినా తెలుస్తాయేమో కనుక్కొని నీ రిపోర్ట్ అందజెయ్యి" అన్నాడు.

నేను తలూపి—"ఓ.కే. సర్!" అంటూ లేచాను.

2

సోమసుందరంపిళ్ళెవీధి మొదట్లో జీప్ ఆపి, రిస్టువాచీ చూసుకున్నాను. ఆరు గంటలు! వీధిలో అట్టే జన సంచారంలేదు. అక్కడక్కడా లైట్లు వెలుగుతున్నాయి.

జీప్ దిగి, వీధికిరుపక్కలావున్న ఇళ్ళు చెక్ చేసుకుంటూ నడవసాగాను. ఇప్పుడు యూనిఫాం వేసుకోలేదు.

ఓ ఇంటి మెయిన్ గేట్ పక్క, పిట్టగోడకి తగిలించి ఉంది సైన్ బోర్డు.

'ఆజన్మ యవ్వన కార్పొరేషన్!'

నా గమ్యం అదే! ఆగి ఓమారు అటూయిటూ చూసేను జాగ్రత్త కోసం. అప్పుడప్పుడూ వీధిగుండా వెళుతున్న జనంలో ఎవ్వరూ నన్ను పట్టించుకోడం లేదని రూఢి అయ్యేక, మూసివున్న మెయిన్ గేటు కొక్కి తీసి తోసేను.

కిర్రుమంటూ తెరుచుకుంది. కంపౌండ్‌లో మసక చీకటి. అది చిన్న డాబా ఇల్లు. తలుపుకి తాళం వేసి వుంది. గబగబ తలుపుని సమీపించాను. గడియకి వేలాడు తున్నది సామాన్యమైన తాళం. జేబులోంచి మారు తాళం చెవుల గుత్తితీసి క్షణంలో తెరిచాను తాళాన్ని.

తలుపుతోసి, లోన అడుగుపెట్టాను. చీకటి! లైటు వెలిగించకూడదు. తలుపుమూసి, టార్చి వెలిగించాను.

ఆగది కుడిపక్కనే మరోగది ఉంది. గుమ్మానికి 'మేనేజర్' అనే బోర్డు బిగించివుంది.

అటు నడిచాను. తలుపుకి తాళం వేసుంది. అటు వంటి తాళాలు తెరవడం నాకు కష్టంకాదు. తెరిచి, తలుపు తోసేను.

గోడవారగా గోద్రేజ్ టేబిల్. టేబిల్ పైన పేపర్ వెయిట్ టెలిఫోన్, ఇంక్ బాటిల్, కలాలూ, రెండు మూడు ఫైళ్ళు సర్ది ఉన్నాయి. టేబిల్ నాలుగువైపులా నాలుగు ఈజీఛెయిర్స్. ముందు టేబిల్ సొరుగు లాగి

చూసేను. ఆ కార్పొరేషన్ పేరు ముద్రించివున్న లెటర్ పేడ్ కనిపించింది పైన. దాన్నితీసి లోపలి వస్తువులు చూద్దామని పేడ్ అందుకున్నాను.

అప్పుడు పడింది దృష్టి, పేడ్ మొదటి పేజీమీద. అంతక్రితం దాని పైపేజీమీద బాల్ పెన్ తో ఒత్తుగా ఏదో రాయడంవల్ల, ఈ పేజీపై గుర్తులు పడ్డాయి. టార్చివేసి పరీక్షగా చూసేను.

ఐదారు పంక్తుల ఉత్తరంలా ఉంది. స్పష్టంగా కనిపించడంలేదు అక్షరాలు. టేబిల్ మీది పెన్సిల్, బ్లేడ్ అందుకుని, బ్లేడ్ తో పెన్సిల్ కార్బన్ని గీరి, పౌడర్ గా ఆ అక్షరాలమీద చల్లేను.

తరవాత మెల్లిగా పౌడర్ని ఊదేను. పైన ఉన్న కార్బన్ ఎగిరిపోయి, మిగతా కార్బన్ అక్షరాల సందుల్లో నిలిచిపోయింది. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయి అక్షరాలు.

చదివేను.

'మిస్టర్ వేలాయుధం!

ఈ రాత్రి సరిగ్గా పది గంటలకు బొంబాయినించి వచ్చే బోయింగ్ విమానంలో, జనప్రియ వస్తున్నట్టునాకు ఇన్ ఫర్ మేషన్ అందింది. ఆమె ఇక్కడి పోలీస్ అధికార్లని ఎట్టి పరిస్థితిల్లోనూ కలుసుకోకూడదు.

అందుకే, మనం ఆమెని విమానం దిగిన తక్షణం కిడ్నాపింగ్ చెయ్యాలి. నీ మనుషులతో వెంటనే వచ్చి నన్ను కలుసుకో. ప్లాన్ వివరిస్తాను.

చక్రవర్తి!'

ఉత్తరం పూర్తిచెయ్యగానే, నా కనుబొమలు ముడి

వడ్డాయి. ఎస్. పి. గారి అనుమానం పొరపాటు కాదన్న మాట. ఇక్కడ నిజంగా ఏవో రహస్య కార్యకలాపాలు జరుగుతున్నాయి.

జనప్రియ ఎవ్వరు? ప్రదీప్ కుమార్ చక్రబర్తి వేలాయుధం సహాయంతో ఆమెని దేనికి అపహరించా లనుకుంటున్నాడు?...

వేలాయుధం మద్రాసు నగరంలో పేరుమోసిన రౌడీ! వాడు చెయ్యని నేరం లేదు. వెళ్ళని జైలు లేదు.

ఐతే, ఆ జనప్రియ పోలీస్ అధికార్లని కలుసుకో కుండా వాళ్ళు దేనికి అపహరించాలనుకుంటున్నారు? ఆమె వద్దనున్న రహస్యం ఏమిటి? తీవ్రంగా ఆలోచిస్తూ చేతి గడియారం చూసుకున్నాను.

ఆరున్నర. విమానం రావడానికింకా చాలా టైం ఉంది. ఆలోగా, ఈ ఫైల్స్ కథేమిటో చూడాలి. టేబిల్ మీది ఫైల్ అందుకున్నాను. అందులో రాసి వున్న వివరాలు చదివి నివ్వెరబోయేను!

అనుమానం తీరక, మొదటినించీ మళ్ళీ క్షుణ్ణంగా పరిశీలించేను. అందులో, నగరంలోని లక్షాధికార్ల పేర్లూ, చిరునామాలూ, వయసులతో సహా అన్ని వివరాలూ స్పష్టంగా ఉన్నాయి. ముఖ్యంగా అవి ఏభై అరవై ఏళ్ళమధ్యఉన్న వయోవృద్ధ లక్షాధికార్లవే అయుండటం గమనార్హం!

నా ఆలోచనల్ని తుంచివేస్తూ, హఠాత్తుగా టేబిల్ మీది టెలిఫోన్ మోగింది. క్షణం దానివైపుచూచి రిసీవర్ అందుకున్నాను.

కొద్దిగా కంఠం మార్చి "ఎవ్వరు?" అడిగేను.

"జనప్రియ, నుంగంబాకం వీధిలోని మూడవసందులో

నెంబర్ 146_వ ఇంట్లో వుంది. తక్షణం బైలుదేరి రండి''

''అదేమిటి? ఆమె రాత్రి పది గంటలకు బొంబాయి నించి విమానంలో వస్తోంది కదా?''

''అది రాంగ్ మెసేజ్! ఆమె ఇక్కడే వుంది. వెంటనే బైలుదేరండి'' అవతల క్లిక్ మంది.

అరంతాక అయోమయంలో పడిపోయేను. ఏం చెయ్యాలిప్పుడు? ఫోన్ చేసిన వ్యక్తి ఎవ్వరు? పేరడిగే వ్యవధి కూడా ఇవ్వకుండా డిస్కనెక్ట్ చేశేడు. అతను నా పేరుకూడా అడగకపోవడం గమనార్హం!

అంటే, ఈ సమయంలో, ఈ ఆఫీసులో ప్రదీప్ కుమార్ చక్రబర్తి ఉంటాడనుకున్నాడా? ఇప్పుడేం చెయ్యాలి? అతను చెప్పిన ఇంటికెళ్ళి ఆ జనప్రియ విషయం కనుక్కోవాలా?

ఆలోచిస్తూ క్రైంబ్రాంచి హెడ్ క్వార్టర్స్‌కి రింగ్ చేసేను. ఆపరేటర్ పలగ్గానే, లైన్‌లోకి సార్జంట్ డేవిడ్‌ని పిలవమని చెప్పేను. ఐదు నిమిషాల తరవాత వచ్చేడతను లైన్‌లోకి.

అతనికి విషయం చెప్పి, ''డేవిడ్! నీవక్కణ్నించి తిన్నగా నుంగంబాకంలోని మూడవ సందులో ఉన్న నెంబర్ 146_వ ఇంటికి వచ్చెయ్. నేనక్కడే ఉంటాను'' అని రిసీవర్ దించేను.

ఆ ఇంటికి యధాతధంగా తాళాలు బిగించి, వీధి మొదట్లో ఆపిన జీప్ ఎక్కి బైలుదేరేను.

3

నుంగంబాకం వీధిలో మూడవ సందు మలుపు దగ్గర జీప్ ఆపి దిగేను. సందులో మసక చీకటి. ఇరుపక్కలా

ఇళ్ళు కట్టిఉన్నాయి. అడుగులో అడుగు వేసుకుంటూ, ఇళ్ళని పరీక్షగా చూసుకుంటూ ముందుకు నడిచేను.

నెంబర్ 146 ఇల్లు అదే!

తలుపు మూసివుంది. అరుగు ఎక్కి తలుపుకి చెవి ఆనించేను.

నిశ్శబ్దం!

తట్టబోయేను. చెయ్యిపడగానే కిర్రుమంటూ తెరుచుకుంది కొద్దిగా! దేనికైనా మంచిదని, పిస్తోలు తీసి తలుపు తోసేను.

చీకటి!

లోన అడుగుపెట్టేను. అంతే!

మాడు పగిలేలా పడింది దెబ్బ! కళ్ళల్లో చుక్కలు మెరిసేయి. తేరుకునే లోపల మరోటి పడింది తల వెనక. కాండం నరికిన చెట్టులా కింద కూలేను.

తిరిగి కళ్లు తెరిచి చూస్తే ఓ గది నేలమీద పడున్నాను. చేతులు వెనక్కి విరిచి కట్టివున్నాయి. గూట్లో కొవ్వొత్తి వెలుగుతోంది. నా ఎదురుగా నిల్చున్న వ్యక్తిని చూసి నివ్వెరబోయేను.

అతని వయసు ఎంతో అంచనా వెయ్యడం దుర్లభంగా ఉంది. ఎన్నో ఏళ్ళనించి క్షవరం చేసుకోక, జడలు జడలుగా అతుక్కుపోయిన తెల్లని శిరోజాలు! అటువంటిదే బొడ్డువరకూ ఎదిగిన చింపిరి గడ్డం!

అంతేకాదు, కనుబొమలూ, కనురెప్పలూ కూడా పండిపోయినట్టు తెల్లగా ఉన్నాయి. ఆ వెంట్రుకలూ, గడ్డమూ చూసి అతనికి ఏ ఎనభై ఏళ్లుంటాయో అనుకుంటారెవ్వరైనా!

ఐతే, అతని శరీర దారుఢ్యం మాత్రం ముప్ఫైఏళ్ళ వ్యక్తికి మల్లే బలంగా కనిపిస్తోంది. ఒంటిమీద నిక్కరు తప్ప మరేంలేదు. మెలి తిరిగిన తొడలు. బలిష్టమైన పిక్కలు. బాడీబిల్డర్ లా కండలు తిరిగిన చేతులు. విశాలమైన ఛాతీ.

మొహంలో వృద్ధాప్యం! ఆకారంలో దృఢత్వం!!

ఏమిటి విచిత్రం?

ఆ గదిలో అతను తప్ప మరెవ్వరూ లేరు.

"ఎవరు నువ్?" అడిగేను ఆశ్చర్యంగా.

"నీవు చక్రవర్తి ముఠావాడివైతే, నేనెవ్వరో నీకు తప్పక తెలిసుండాలి!" అన్నాడు అతను తీక్షణంగా చూస్తూ.

అతని భాషలో విచిత్రమైన యాసవుంది. ఫోన్ లో నేను విన్న కంఠం అదే! "జనప్రియ ఇక్కడుందనీ, వెంటనే రమ్మనీ నీవేకదా ఫోన్ చేసింది?" అడిగేను.

"ఔను! మిమ్మల్నిక్కడికి పిలిపించి మక్కలిరగ తందామనే అలా చేసేను. ఇప్పుడు చెప్పు, ఎవరు నువ్? చక్రవర్తి ఎక్కడున్నాడు?" అడిగేడతను.

ఇంతవరకూ అతనే చక్రవర్తి ముఠావాడయుంటాడనుకుంటున్నాను. ఇతను వాళ్ళ ప్రత్యర్థన్న మాట! తేలికపడింది మనసు.

"నేనతని ముఠావాణ్ణి కాను. పోలీస్ ఇన్స్పెక్టర్ని. వాళ్ళ ఆజన్మయవ్వన కార్పొరేషన్ ఆఫీసు తనిఖీ చేస్తుండగా, నీ ఫోన్ కాల్ వచ్చింది..."

అతను ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూసి "ఐతే, జనప్రియ ఈ రాత్రి బొంబేనించి వస్తున్నట్టు నీకెలా తెలుసు?" అన్నాడు.

“నీ ప్రశ్నకి తరవాత జవాబు చెబుతాగానీ, ముందు నా సందేహం తీర్చు.”

“ఏమిటి?”

“నీ వయసెంత?”

అప్పటివరకూ సీరియస్‌గా వున్న అతను, పకపక నవ్వేడు. “చెబితే నమ్ముతానా! ఐనా, అడిగేవు గనక చెబుతా విను. నా కిప్పుడు నూటానలభై ఏళ్ళు!”

దిగ్భ్రాంతితో క్షణంపాటు నా నోట మాట పెగల్లేదు.

“నూటానలభై ఏళ్ళా? అసంభవం!”

“ఔను. దైవసృష్టి రీత్యా అసంభవం! కాని, నేను దాన్ని సంభవం చేశాను. నీవు నమ్మినా, నమ్మకపోయినా నాకు నష్టం లేదు.”

“ఇంతకీ ఎవరు నువ్?”

అతని కంఠం గంభీరమైంది. “నేను సుందరరాజన్ని! నా కిప్పుడెన్నేళ్ళో తెలుసుకోవాలనుకుంటే, తిన్నగా, షిప్పింగ్ ఆఫీస్‌కెళ్ళి పాత రికార్డ్స్ చెక్ జెయ్. అందులో జలతరంగ అనే ఒక ఓడ...” మాటలింకా అతని నోట్లోనే వుండిపోయేయి.

హఠాత్తుగా గది తలుపు భళ్ళున తెరుచుకుంది.

ఇద్దరం ఉలిక్కిపడి అటుచూశాం! తలుపు మధ్య డేవిడ్ నిల్చునున్నాడు. అతని చేతిలో పిస్తోలు!

“ఏయ్ ముసలీ! చేతులు పై...” డేవిడ్ మాటలింకా ఇవతలికి రానేలేదు.

ఆ వృద్ధుడు మెరుపుకన్నా వేగంగా, తలుపువరకూ ఎగిరి డేవిడ్ డొక్కలో ఒక్క తన్నుతన్ని, మాయమయ్యేడు.

అరక్షణంలో జరిగిపోయిందిదంతా.

అతను తన్నిన తాపుకి అమాంతం విరుచుకుపడ్డ డేవిడ్, వెంటనే లేచి నిల్చున్నాడు. అప్పటికి ఆ వృద్ధుడి ఛాయలు కూడా లేవక్కడ.

"అతని వెనక పరిగెత్తడం వృథాప్రయాస. ముంది టొచ్చి నా కట్లు విప్పు!" అన్నాను.

"వాడు ముసలాడా? కుర్ర వహిల్వానా? ఖడ్గమృగం కన్నా బలంగా కుమ్మేడు రాస్కెల్!" డొక్క సలుపు కుంటూ వచ్చి కట్లు విప్పేడు డేవిడ్.

అంతవరకూ జరిగిన సంఘటనలన్నీ క్లుప్తంగా అతనికి వివరించి—"నీవిలా సడన్‌గా రాకుండా వుంటే, అతని వల్ల అనేక విషయాలు తెలిసేవి...డోంట్ వర్రీ, ఇప్పుడు వెంటనే షిప్పింగ్ ఆఫీస్‌కెళ్ళి మిగతా విషయాలు తెలుసు కుందాం పద!" అన్నాను లేస్తూ.

4

షిప్పింగ్ ఆఫీస్ అధికార్లకి నా ఐడెంటిఫికేషన్ కార్డు చూపించి, అక్కడి పాత రికార్డ్స్‌లో 'జలతరంగ' అనే ఓడ గురించిన వివరాలు వెలికి తీయమని కోరేను.

అరగంట పట్టింది ఆ పాత ఫైలు కనుక్కోడానికి.

అందులోని వివరాలు నన్ను చకితుణ్ణి చేశాయి! నూరేళ్ళ క్రితం 'జలతరంగ' అనే ఆ ఓడ మద్రాసు రేవు నించి ఆస్ట్రేలియాకు బైలుదేరింది. విచిత్రం ఏమిటంటే ఆ ఓడ కెప్టెన్ పేరు సుందరరాజన్!

సముద్ర మార్గాన బైలుదేరిన ఆ ఓడ, అటు ఆస్ట్రే లియా చేరలేదు. ఇటు తిరిగి రాలేదు. దానికోసం వెతికి వేసారిన ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వం, అది సముద్రంలో

ఎక్కడో మునిగిపోయివుంటుందని నిర్ణయించి, దాని సంగతి మరచిపోయింది.

దీన్నిబట్టి ఆ వృద్ధుడు చెప్పింది నిజమేననిపిస్తోంది. ఎందుకంటే, ఓడ కెప్టెన్‌గా అప్పుడతని వయస్సు నలభై సంవత్సరాలుంటుంది. అది సముద్రంలో అదృశ్యమై వందేళ్ళవుతోంది. ఆ లెక్కన ఇప్పుడా వృద్ధుడికి నూట నలభైఏళ్ళు!

నూరేళ్ళక్రితం ఓడతో సముద్రంలో మాయమైన కెప్టెన్ సుందరరాజన్ ఇన్నేళ్ళ తరవాత, మళ్ళీ మద్రాసులో ఎలా ప్రత్యక్షమయ్యేడు? ఇంతకాలం ఎక్కడున్నాడు? అతని అవతారం అలా దేనికుంది? ఇంత వయసులోనూ అతని శరీరం నవయువకుల కన్నా బలిష్టంగా ఎలా వుండగలిగింది.

ప్రదీప్‌కుమార్ చక్రబర్తితో అతనికేమిటి పగ?

జనప్రియ ఎవ్వరు? బొంబాయి నించి రాబోతున్న ఆమెని ప్రదీప్‌కుమార్, రౌడీల సహాయంతో దేనికి అపహరించాలనుకుంటున్నాడు. ఆమెకీ, సుందరరాజన్‌కూ ఏమిటి సంబంధం?

ప్రశ్నలు, అన్నీ ఎడతెరిపిలేని ప్రశ్నలు. మనసును కల్లోలితం చేస్తున్నాయి. రిస్టువాచీ చూసుకున్నాను.

పావు తక్కువ పది. బొంబే ప్లేన్ వచ్చే టైం అవుతోంది. షిప్పింగ్ ఆఫీస్ అధికార్లకి థాంక్స్ చెప్పి, డేవిడ్‌తో బైలుదేరాను, ఏర్‌పోర్ట్‌కు!

అప్పటికే, బొంబే విమానం కిందికి దిగడానికి ఆకాశంలో సర్కిల్స్ కొడుతోంది. లౌంజ్‌లో ఎందుకోగానీ జనం విపరీతంగా కనిపించేరు. పత్రికా విలేఖర్లు ఫ్లాష్

కెమెరాలతో సిద్ధంగా ఉన్నారు.

అంటే, ఆ విమానంలో ప్రముఖవ్యక్తి ఎవ్వరో వస్తున్నారన్న మాట. అదే అడిగేను ఓ ప్రెస్ రిపోర్టర్ని.

నన్ను ఎగా దిగా చూసి—"బహుశా మీరు సినిమా పత్రికలు చదవరనుకుంటాను" అన్నాడు.

"సినిమా పత్రిక తిరగేసే తీరిక వుండదు నాకు. ఐతే, మీరా విమానంలో సినీ పరిశ్రమకి చెందిన వ్యక్తి రాక కోసం ఎదురు చూస్తున్నారన్న మాట!" అడిగేను నవ్వుతూ.

"మామూలు వ్యక్తి అయితే దేనికి వస్తాం? ఆమె సినీ ఫీల్డులో సంచలనం సృష్టించిన గొప్ప నటి! ఈ మధ్యే కొత్తగా మద్రాసు చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టి, తన అసమాన నటనాకౌశలంతో, మూడవ చిత్రంతోనే 'ఊర్వశి' బిరుదును చేజిక్కించుకుంది.

ఢిల్లీలో జరిగిన బిరుదు ప్రదానోత్సవంలో పాల్గొని, అట్నించి, బొంబే స్టూడియోలో ఓ షూటింగ్ అటెండ్ జేసి, ఇప్పుడు మద్రాసు తిరిగివస్తోంది. అందుకే, సినీ ప్రెస్ రిపోర్టర్లమంతా ఇక్కడ పోగయ్యాం!"

"ఆమె పేరు?"

"జనప్రియ!"

ఆశ్చర్యంతో నా కళ్ళు విప్పారేయి. ఏ జనప్రియనైతే కిడ్నాప్ చెయ్యడానికి పథకం వేయబడిందో, ఏ జనప్రియకోసం నేనిక్కడికి వచ్చేనో ఆమె సినిమా తారా?

ఇంతలో, విమానం రన్ వే మీద దిగింది.

డేవిడ్ వైపు తిరిగేను. "జనప్రియ ఈ మధ్యే సినిమా రంగంలో ప్రవేశించిన కారణంగా, మనకు సినిమాలు చూసే తీరుబడి లేనికారణంగా, జనప్రియ ముఖ పరిచయం లేదు మనకు. అందుకే నువ్వు విడిగావుండి విమానంలోంచి దిగేవాళ్ళని కనిపెట్టు!"

డేవిడ్ తలూపి జనంలో కలిసిపోయేడు.

5

విమానంలోంచి జనం దిగడం ప్రారంభించేరు. బైట నిల్చున్నవారి తొక్కిసలాట ఉధృతమయింది.

సరిగ్గా అదేక్షణంలో "రక్షించండి...రక్షించండి... చంపేస్తున్నారు...బాబోయ్!" అన్న కేకలు విని, ఉలిక్కిపడి అటు చూసేను.

నలుగురు వస్తాదుల్లాటి మనుషులు కలసి, ఓ వ్యక్తిని చితక బాదుతున్నారు. విమానం వైపు తోసుకొస్తున్న జనం, ఇప్పుడా స్టంట్ మాస్టర్ల చుటూ గుమిగూడ సాగేరు.

అటు దౌడు తీసేను. గుంపును చీల్చుకుంటూ లోనికి దూరేను. చుట్టూనిల్చుని తమాషా చూస్తున్న వారిమీద ఒళ్ళు మండిపోయింది నాకు.

"నలుగురు కలసి ఓ వ్యక్తిని చితక తంతోంటో, రక్షించడం పోయి, తమాషా చూస్తారా?" అంటూ బూటుకాలితో ఓ వస్తాదు డొక్కలో ఈడ్చితన్నేను.

వాడు ఎగిరి అవతల పడ్డాడు. అంతే!

మరుక్షణం అక్కడ పెద్దదొమ్మి ప్రారంభమయింది. ముష్టిఘాతాలూ, తన్నులూ కురవసాగేయి. ఎవరుఎవర్ని తంతున్నారో పాలుపోవడంలేదు.

కొద్దిసేపట్లో స్థానిక పోలీసులువచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇప్పుడా వస్తాదులు నలుగురూ, నేల మీదపడి మూలుగుతున్నారు. అంతక్రితం వాళ్ళచేత తన్నులుతిన్న వ్యక్తి, కింద కూర్చొని దెబ్బలు సలుపుకుంటున్నాడు.

"మిస్టర్! ఎవరు మీరు? ఈ వెధవలు దేనికి దాడి జేసారు మీమీద?" అడిగానతన్ని.

"తెలీదండీ! నాపేరు సూర్యారావు. ఓ సినిమా పత్రిక రిపోర్టర్ని. ఈ బ్రూట్స్ అన్యాయంగా చితగ్గొట్టేరు నన్ను" అన్నాడతను రుద్ధకంఠంతో.

కింద పడున్న ఓ రౌడీని సమీపించి కాలర్ పట్టి కూర్చోబెట్టేను. "చెప్పు! అతన్నెందుకు కొట్టారు? నిజం చెబితేసరి. లేదా బూటు కాలితో తన్ని తన్ని నీ పక్కటెముకలు విరగ్గొడతాను."

నా బెదిరింపు పనిచేసింది. "ప్రదీప్‌కుమార్ అనే వ్యక్తి మమ్మల్నిక్కడికి తెచ్చాడు. నలుగురికీ చెరో వంద ఇచ్చి, విమానం రాగానే గుంపులో ఈ వ్యక్తిని చూపించి, తన్నమని పురమాయించేడు..."అన్నాడతను బెదురు చూపులు చూస్తూ.

అప్పుడర్థమైంది నాకా నాటకం ఏమిటో?

అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. సార్జంట్ డేవిడ్ రొప్పుతూ వచ్చి "సార్, మనం పప్పులో కాలేశాం! ఇక్కడీ గొడవ ప్రారంభమవగానే, గుండాల మరో దళం అటు జనప్రియను ఎత్తుకెళ్ళారు. ఆమెతోబాటు మరో యువతిని తీసుకెళ్ళారు. జనప్రియతోవున్న ఆమె బిజినెస్ మేనేజర్ని వాళ్ళు మూర్ఛపోగొట్టేరు. చూస్తూ

చూస్తూనే జరిగిపోయిందిదంతా!'' అన్నాడు.

"ఆ మేనేజర్ ఎక్కడున్నాడిప్పుడు?"

"రండి చూపిస్తాను'' అంటూ గుంపులోంచి బయట పడ్డాడు డేవిడ్.

రౌడీలను స్థానిక ఇన్స్పెక్టరుకు అప్పగించి, అతన్ని అనుసరించాను. ఓచోట మరోగుంపు గుమికూడివుంది.

"జనప్రియ బిజినెస్ మేనేజర్ మీరేనా?'' అడిగేను. అప్పుడే స్పృహలోకి వచ్చిన అతను చుట్టూ అయోమయంగా చూస్తూ తలూపేడు.

"ఆ గుండాలు జనప్రియతోబాటు మరోయువతినీ ఎత్తుకు పోయేరట. ఎవ్వరామె?"

"ఆవిడ పెర్సనల్ సెక్రటరీ, శశికళ."

"మీ పేరు?"

"విక్రమ్!"

"నేను సిటీ క్రయింబ్రాంచి ఇన్స్పెక్టర్ రాజారెడ్డిని! మా వెంట రండి. పోలీస్ హెడ్ క్వార్టర్సులో మీ వాఙ్మూలం తీసుకోవాలి'' అంటూ అతని భుజంపట్టి నిలొబెట్టేను.

ముగ్గురం జీప్ ఎక్కాం!

6

నేనే డ్రయివ్ చేస్తున్నాను. విమానాశ్రయం ఏరియాదాటి, చీకట్ని చీల్చుకుంటూ నగరంవైపు పరుగెడుతోంది జీపు.

ఓచోట హఠాత్తుగా సడన్ బ్రేక్ వెయ్యవలసివచ్చింది హెడ్ లైట్సు కాంతిలో రోడ్డుమధ్య ఓయువతి నిల్చుని చేతులెత్తి ఆపమని సైగ జేస్తోంది. ఆమె దుస్తులకూ చేతు

లకూ మొహానికి దుమ్మూ ధూళీ అంటుకునుంది.

"జనప్రియ ఆమే!" అన్నాడు విక్రమ్ దాదాపు అరుస్తూ.

ఆశ్చర్యంతో నాకళ్ళు పెద్దవయ్యాయి. ఆమె సినిమా నటిలాకాక, సాదా చీరలో సామాన్యమైన యువతిలా కనిపిస్తోంది. ఎటువంటి తళుకూ బెళుకూ లేకుండా!

అంతలో ఆమె గబగబ జీపును సమీపించి, "అరె, విక్రమ్‌గారా! ఎక్కడికెళ్తున్నారు?" అడిగింది ఆశ్చర్యంగా.

"మీగురించి పోలీస్ హెడ్‌క్వార్టర్సులో రిపోర్టివ్వడానికి. వీరు క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి గారు" అన్నాడు విక్రమ్ నన్ను చూపిస్తూ.

"ఎంత విచిత్రం! మద్రాసు చేరిన మరుక్షణం నేను మిమ్మల్నే కలుసుకోవాలనుకున్నా ఇన్‌స్పెక్టర్ గారూ!" అంది జనప్రియ ఫ్రంట్‌సీట్లో కూర్చుంటూ.

"మిమ్మల్ని గుండాలు కిడ్నాప్ చేశారుకదా! ఇంత త్వరగా వారి బారినుండి ఎలా తప్పించుకోగలిగారు?" అడిగాను ఆశ్చర్యంగా.

జనప్రియ నవ్వి "అదికూడా యిలాగే కాకతాళీయంగా జరిగిపోయింది. బహుశా, వాళ్ళు నన్నింతవరకూ చూసి ఉండరు. అందుకే నాతోబాటు నా సెక్రటరి శశికళనూ బలవంతంగా లాక్కెళ్ళి వారి కార్లలో కుదేసారు.

నా సెక్రటరీకాస్త ఎక్కువ మోతాదులో అలంకరించుకునుంటుంది. ఆ గుండాలు ఆమెనోకార్లో, నన్నో కార్లో కుదేసి ఊదారిన బయలుదేరారు. నావెంట వున్న రౌడీలను బట్టి నన్ను వాళ్ళెరగరని తెలిసిపోయింది.

అప్పుడే నాకో ఉపాయం తట్టింది. జనప్రియముందు వెళుతున్న కార్లో వుందనీ, నేనామె సెక్రటరీననీ చెప్పేను వాళ్ళకి. అంతే! డోర్ తెరచి నన్ను ఒక్క తోపు తోసిపోయేరు'' అంది.

''మీ సమయస్ఫూర్తిని అభినందించాల్సిందే! మీరు ప్రదీప్ కుమార్ చక్రబర్తి అనే బెంగాలీని యెరుగుదురా?''

''లేదు. ఎవ్వరతను?''

''సరే, ఆజన్మయవ్వన కార్పొరేషన్ పేరు విన్నారా ఎప్పుడయినా?''

''లేదే! ఎక్కడుందది?''

''ఆశ్చర్యంగా ఉందే! వాళ్ళగురించి ఏమీ తెలియని, మిమ్మల్ని వాళ్ళుదేనికి అపహరింప బూనేరు? సరే, తన వయసు నూటానలభయ్యేళ్ళని చెప్పుకునే వృద్ధుడు సుందర రాజన్ తెలుసా మీకు?''

జనప్రియ నిట్టూర్చి ''తెలుసు!'' అంది.

''ఎలా తెలుసు?'' అడిగాను ఆత్రుతగా.

''ఆయన మా ముత్తాత!''

''ఆ వృద్ధుడు మీ ముత్తాత?''

''ఔనట! నేనింతవరకూ అతడ్ని చూళ్ళేదు. ఢిల్లీలో బిరుదు ప్రదానోత్సవంలో పాల్గొని, అట్నించి బొంబే వెళ్ళాను ఓ షూటింగ్ లో పాల్గోడానికి.

అక్కడి స్టూడియోలో షూటింగ్ కార్యక్రమంలో మునిగి తేలుతున్న నా పేర ఓ ఉత్తరమూ, పెద్దపార్శిలూ వచ్చాయి ఇక్కణ్నించి. సంతకం చేసి తీసుకొన్నాను.

ఆ పార్సెల్ లోపల రేకుపెట్టె వున్నట్టుంది. పైన

కేన్వాస్ గుడ్డతో చాలా పకడ్బందీగా పేక్ జేసి, జాగ్ర త్తగా సీలువేసి వుంది. ముందు ఉత్తరాన్ని చదివి తెల్ల బోయాను.

ఓ పట్టాన నమ్మ బుద్ధి కాలేదు అందులోని విషయాలు. చాలా అసహజంగా ఉన్నాయి.

ఆ ఉత్తరం రాసిన వ్యక్తి పేరు సుందరరాజన్ట! ఆయనకిప్పుడు నూటనలభయ్యేళ్ళట. నేనాయన ముని మనుమరాలి కూతుర్నిట. కొన్ని చిత్రమైన పరిస్థితుల్లో ఆయన ఇన్నాళ్ళూ మమ్మల్ని కలుసుకోలేక పోయేడుట.

అనుకోకుండా మద్రాసుచేరి తన వంశజుల గురించి ఆరాతీస్తే మిగిలింది, ఇప్పుడావంశంలో మిగిలి వున్నది నేనొక్కర్తినే అని తెలిసిందిట. సమయానికి నేను మద్రాసులో లేనందువల్ల, తనని కొందరు దుష్టులు వెన్నాడుతున్నందువల్ల, తన దగ్గిరున్న ఒక అమూల్య మైన పాకెట్ను నాకు పార్శిల్ జేస్తున్నాననీ, తనని దాన్ని నా ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకోమనీ రాసేడు.

నాకెందుకో ఆ ఉత్తరం పతి బూటకమనిపించింది. మనిషి నూటానలభయ్యేళ్ళు జీవిస్తాడా ఎక్కడైనా? అతను నిజంగా నా ముత్తాతే అయితే, రెండు తరాలు గడిచిపోయే వరకూ ఎక్కడున్నాడు?

ఎన్నడూ లేనిది నేను సినిమా నటినైన్వల్ప వ్యవధి లోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటున్న సమ యంలో, హఠాత్తుగా ఎక్కణ్నించి ఊడిపడ్డాడు? అంతా నాటకమనిపించింది.

కొత్తగా ఫీల్డులో ప్రవేశించిన నేను, ఇంత త్వరగా

తారాపథాన్ని అధిగమించడాన్ని ఓర్వలేక, యెవ్వరో ఆ పార్శిల్లో నాకు నష్టం కలిగించేదేదో పెట్టి పంపివుంటారనీ, దాన్ని తెరవకుండా నా పేరుమీదే మద్రాసుపంపి, బొంబేలో షూటింగ్ పూర్తయ్యాక ఇక్కడికి వచ్చి, దాన్ని విడిపించుకొని, పోలీసు అధికార్లను కలుసుకోవాలని అనుకున్నాను.

ఊహించని విధంగా ఇప్పుడీ సంఘటన జరిగింది. దీనితో నా అనుమానం వట్టి అనుమానం కాదని తేలిపోయింది.''

''ఇప్పుడా పేకెట్ ఎక్కడుంది?'' అడిగాను.

''ఇక్కడి జనరల్ పోస్టాఫీసులోనే ఉండివుంటుంది. ఎందుకంటే నేను దాన్ని బొంబేనుంచి నాలుగురోజుల ఇక్కడి నా అడ్రస్పై, నా పేరు మీదే పంపేను.

నా సంతకం లేనిదే దాన్నెవరికీ ఇవ్వలేదుకదా. డిస్పాచ్ కాకుంటే, ఏడు రోజులవరకూ అది పోస్టాఫీస్లోనే పడుంటుంది.''

''మీ సెక్రటరీని తీసికెళ్ళిన ఆ గుండాలు ఈపాటికి తాము తెచ్చింది మిమ్మల్ని కాదనీ, మీ సెక్రటరీననీ గ్రహించి ఉంటారు. ఆమెను హింసించి ఆ పార్సెల్ ఎక్కడుందో కూడా కనుక్కునుంటారు.

మనం వెంటనే జనరల్ పోస్టాఫీసునుండి దాన్ని తెప్పించుకోవాలి. నగర కమీషనర్ గారితో మాట్లాడి నేనా ఏర్పాటు చేస్తాను. అంతవరకూ మీరు మా హెడ్ క్వార్టర్లో సురక్షితంగా ఉండండి!'' అన్నాడు.

ఆమెనీ, ఆమె మేనేజర్ని హెడ్ క్వార్టర్లో వదలి, సార్జంట్ డేవిడ్తో హుటాహుటిన వెళ్ళి కమీషనర్

గార్ని కలుసుకున్నాను. ఆయనకు విషయమంతా విపులీకరించి, నా పథకాన్ని వివరించాను.

ఆయన తక్షణం పోస్టాఫీస్ అధికార్లకు ఫోన్ చేసి, నలుగురు కానిస్టేబుళ్ళతో కూడిన వ్యాన్ను పంపారు పోస్టాఫీసుకు. అలాగా నేను సార్జంట్ డేవిడ్ కు కొన్ని సూచనలిచ్చి విడిగా పంపేను.

7

జనరల్ పోస్టాఫీసులో రాత్రింబవళ్ళు పని జరుగుతుంటుంది. నగరం నడిబొడ్డున, నాలుగురోడ్ల కూడలిలో వుంది నాలుగంతస్తుల పోస్టాఫీసు భవనం. దానికి కాస్త దూరంలో, కీసీడలో జీప్ ఆపి చూస్తూ కూర్చున్నాను.

అప్పటికే పోస్టాఫీసు ప్రాంగణంలో కమీషనర్ గారు పంపిన పోలీసువ్యాన్ వచ్చి ఆగివుంది. బహుశా, కానిస్టేబుళ్ళు సార్సెల్ తీసుకోడానికి లోని కెళ్ళుంటారు.

రాత్రి పన్నెండు గంటలవుతోందిప్పుడు.

లోని కెళ్ళిన కానిస్టేబుళ్ళు బయటికివస్తూ కనిపించారు. ఒకతని చేతిలో పెద్దపాకెట్ వుంది. నలుగురూ వ్యాన్ ఎక్కి బయలుదేరారు. వాళ్ళని ఫర్లాంగుదూరం పోనిచ్చి స్టార్ట్ చేశాను.

ఆ వ్యాన్ దృష్టిలోంచి తప్పిపోకుండా జాగ్రత్తగా ఫాలో అవసాగాను. పోస్టాఫీస్ కూ, పోలీస్ హెడ్ క్వార్టర్ కూ మధ్య ఒకచోట నిర్మానుష్య ప్రదేశం వస్తుంది. నేనేదయితే ఊహించానో, సరిగ్గా అదే జరిగిందక్కడ.

ముందు వెళుతున్న వ్యాన్, ఆ నిర్మానుష్య ప్రదేశం చేరగానే సడన్ గా ఆగిపోయింది. నేనూ వెంటనే జీప్

ఆపి, హెడ్ లైట్స్ ఆఫ్ జేసి, చూస్తూ కూర్చున్నాను.

వ్యాన్ లైట్లు ఇంకా వెలుగుతున్నాయి. ఆ కాంతిలో దాని కెదురుగా రోడ్డుకడ్డంగా రెండు కార్లు ఆగివున్నాయి. అందుకే, వ్యాన్ డ్రైవర్ విధిలేక వ్యాన్ ఆపేడు.

వ్యాన్ ఆగిన మరుక్షణం చీకట్లోంచి నలుగురైదుగురు వ్యక్తులు వచ్చి, బలవంతంగా వ్యాన్ తలుపులు తెరిపించేరు. అందులో ఒకడి దగ్గర స్టెయిన్ గన్ కూడావుంది. లోపలున్న కానిస్టేబుళ్ళని ఇవతలికి లాగి, వారివద్దవున్న ఆ పాకెట్ లాక్కుని, కార్లలో దూరి దూసుకుపోసాగేరు.

జీప్ స్టార్ట్ చేశాను. రివ్వున ముందుకు పోనిచ్చాను.

వ్యాన్ పక్కనించి పోతూ "మీరు వెళ్ళిపోండి!" అన్నాను కానిస్టేబుళ్ళతో.

దుండగుల కార్లు చాలా వేగంగా పోతున్నాయి ముందుకు. నేనూ అదే స్పీడ్ ప్రిపేర్ అవుతూ, వారికి ఫర్లాంగు యివతల వుండి ఫాలో అవుతున్నాను హెడ్ లైట్స్ వెలిగించకుండా!

నగర పొలిమేరలు దాటాం!

ఆ కార్ల హెడ్ లైట్స్ కాంతి తప్ప, చుట్టూ చిరు చీకటి. మెయిన్ రోడ్ వదలి కుడివైపు తిరుగుతున్నాయి కార్లు.

రాళ్ళూ రప్పలూ దాటుకుంటూ దాదాపు మైలు దూరం వెళ్ళి శిథిలమైవున్న ఓ యింటి దగ్గర ఆగేయి కార్లు. చిన్నచిన్న పొదలతో నిండివుంది ఆ ప్రదేశం. ఒక పొద పక్కన జీప్ నిలిపి, ఇంజన్ ఆఫ్ చేశాను.

ఆ నలుగురూ కార్లలోంచి దిగి, గబగబ శిథిలాల్లో అదృశ్యమయ్యేరు. జీప్ దిగి, అటు నడిచేను. శిథిలాల్లో

ప్రవేశించి చుట్టూ కలయచూసేను.

ఓ చోట గదిలాంటిది కనిపిస్తోంది. జీర్ణదశలో వున్న చెక్క తలుపు మూసివుంది. దాని పక్కనే మూసివున్న ఊచల కిటికీ కనిపిస్తోంది. లోపలినించి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

పిస్తోలు తీసి, సవ్వడిగాని అడుగులతో అటు నడిచేను. సందుల్లోంచి, లోపల కొవ్వొత్తి వెలుగుతున్నట్లు కాంతి కనిపిస్తోంది గుడ్డిగా.

సందుమధ్య కన్నుపెట్టి చూసేను లోనికి. పాకెట్ తెచ్చిన నలుగురు వ్యక్తులూ నిల్చున్నారు లోపల. గళ్ళ లుంగీ, చారల బనీను వేసుకున్న ఓ అజానుబాహుడు ఓ మూల రాతిమీద చతికిలబడున్నాడు.

వెంటనే గుర్తుపట్టేను వాణ్ణి. వాడే వేలాయుధం!

వారిమధ్య ఫుల్‌సూటులో వున్న ఓ నడివయసు వ్యక్తి నిల్చునున్నాడు. ఇప్పుడా పాకెట్ అతని చేతిలో వుంది. బహుశా, ప్రదీప్‌కుమార్ చక్రబర్తి అతనే అయుంటాడు.

అతను వాళ్ళతో అంటున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి నాకు.

"...ప్రపంచపు ధనరాసి అంతా నా చేతిలోవుంది. ఇందులోవున్న వస్తువుకోసం కోటీశ్వరులూ, లక్షాధికార్లూ తమ యావదాస్తిని పణంగా పెట్టమన్నా పెట్టగలరు!" అంటున్నాడు చక్రబర్తి మెరిసే కళ్ళతో ఆ పాకెట్‌ని చూస్తూ.

"ఐతే, మాకేమిస్తావ్?" అడిగేడు మూల కూర్చున్న వేలాయుధం.

"డబ్బు విషయమంటారా? నా సహచరులైన మిమ్మల్ని కొద్దిరోజుల్లో కుబేరుల్ని చేస్తాను. అంతేకాదు, మీ కెవ్వరూ యివ్వజాలని ఒక అమూల్యమైన బహుమతి కూడా యిస్తాను. చూడండి ఆ బహుమతి యీ పెట్టె లోనే వుంది" అంటూ పాకెట్ మీద కేన్వాస్ కవర్ లాగేడు చక్రబర్తి.

లోపల అల్యూమినియం పెట్టె వుంది. బటన్ వత్తి పెట్టె తెరిచేడు. అంతే! అతని ముఖం రంగులు మారింది.

పెట్టిలో గులకరాళ్ళు, చిత్తుకాగితాలూ తప్ప మరేం లేవు!

"మోసం! ద్రోహం!! వేలాయుధం...మనం చిత్తుగా మోసపోయాం ఇది ఆ పెట్టెకాదు. ఎవ్వరో మార్చేశారు" అన్నాడు అరుస్తూ.

"ఆ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే పిండం! వాడి సంగతి నాకు తెలుసు. జిత్తులమారి నక్క! వాడే చేసుంటాడీపని!"

ప్రదీప్ కుమార్ పళ్ళు పటపట కొరికి "ఆల్ రైట్! వాడా పేకట్ చేజిక్కించుకున్నంత మాత్రాన సరికాదు. ఆ పేకెట్ లో వస్తువు ఎందుకుపయోగపడుతుందో, అందు లోని మహత్యం ఏమిటో వాడికి తెలియాలిగా!

ఇప్పుడు మనమిక్కడుండటం కుద దండగ. తక్షణం బంబోసా వెళదాం. అక్కడ ఆ వస్తువు కోకొల్లలుగా దొరుకుతుంది. కాస్త కష్టపడాలి. అంతే" అన్నాడు.

"బంబోసా ఏమిటి?" అడిగేడు వేలాయుధం అర్థం కాక.

"చెబుతాను. వివరంగా చెబుతాను. మీరంతా నా

వెంట రావడానికి సిద్ధంగా ఉన్నారా?''

''ఒకవేళ అక్కడ నీకావస్తువు దొరికితే మాకూ ఇస్తావా?'' అడిగేడు వేలాయుధం.

''నేను మీకిచ్చే ప్రత్యేక బహుమతి అదేమరి!''

''ఐతే, వస్తాం! ఇంతకీ ఏర్‌పోర్ట్‌నుంచి మనం యెత్తు కొచ్చిన అమ్మాయిని ఏం చేద్దామంటావ్?''

''దానితో మనకిప్పుడు పనిలేదు. వదిలెయ్యండి!''

''వేలాయుధం! ఎవ్వరో బయట వున్నారు. మనల్ని గమనిస్తున్నారు. వెళ్ళండి పట్టుకోండి.'' అరిచేడు చక్రబర్తి ఉన్నట్లుండి.

వేలాయుధంతోపాటు మిగిలిన రౌడీలు తలుపువైపు పరిగెత్తారు.

మరుక్షణం నేను మెరుపులా చీకట్లోకి గెంతాను.

''అదుగో,ఎవ్వరో పారిపోతున్నారు'' అరిచాడొకడు.

''ఢాం... ఢాం...'' మంటూ పిస్తోళ్ళు పేలసాగాయి.

గుళ్ళు రయ్‌మంటూ నా పక్కలనుంచి దూసుకుపోతున్నాయి.

పరిగెత్తుతూనే పిస్తోలు వారివేపు గురిపెట్టి పేల్చసాగేను. దాంతో వాళ్ళు ముందుకు రాకుండా అక్కడే నిలబడి పోయేరు. పిక్కబలం కొద్దీ దౌడుతీస్తూ, జీపు దగ్గరకి జేరుకుని, క్షణాల్లో స్టార్టుజేసి బయలుదేరాను.

ఐదునిమిషాల్లో మెయిన్‌రోడ్డు మీదికెళ్ళి, మద్రాసు వైపు తిప్పాను. ఒకే ఒక విషయం నా బుర్రలో గింగురుమంటోంది.

'బంబోసా!'

ఎక్కడో ఎప్పుడో చదివినట్టుంది ఆపేరు.

ఎక్కడ?

ఎంత ఆలోచించినా సమయానికి గుర్తువచ్చి చావడం లేదు!

8

మా హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో జీప్ ఆపి దిగాను. మెట్లగుండా పైకెళ్ళి నా ఆఫీస్‌లో అడుగు పెట్టేను. అక్కడ విక్రమ్, జనప్రియ, డేవిడ్ నాకోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

టేబిల్ మీద డేవిడ్ పోస్టాఫీస్‌నించి తెచ్చిన ఆ పార్సిల్ సురక్షితంగా వుంది.

కుర్చీలో చతికిలబడి, అంతవరకూ జరిగిన సంఘటనలు వారికి వివరించి "పోస్టాఫీస్‌లో ఆ పాకెట్లు మార్పించింది నేనే. వారి బందీగా వున్న మీ సెక్రటరీద్వారా, ఆ పాకెట్ పోస్టాఫీస్‌లో ఉందని వాళ్ళు కనుక్కుంటారని ఊహించి, కమీషనర్‌గారి చేత పోస్టల్ అధికార్ల సహాయంకోరి డేవిడ్‌ను ముందుగా విడిగాపంపి పార్సిళ్ళు మార్పించాను. కానిస్టేబుళ్ళు నకిలీ పాకెట్‌తో వ్యాన్‌లో బయలుదేరారు. డేవిడ్ అసలు పాకెట్‌తో ఇటొచ్చేశాడు. ఇప్పుడిందులో ఏముందో విప్పిచూద్దాం!" అంటూ పాకెట్ అందుకొని విప్పాను.

లోపల రేకుడబ్బా వుంది. దాన్ని తెరచి నివ్వెరబోయాం! ఏ మహత్తర వస్తువో వుంటుందనుకున్న ఆ పెట్టెలో, కేవలం ఆకుపచ్చరంగు చూర్ణంవుందినిండుగా.

ఆ చూర్ణంమీద మడతపెట్టిన ఓ కాగితంకూడావుంది. ముందు చిటికెడు చూర్ణంతీసి వాసన చూసేను. ఏదో ఆకును ఎండబెట్టి, దంచి చూర్ణం చేసినట్టుంది. విచిత్రమైన వాసన!

కాగితం అందుకుని మడత విప్పేను.

అది అరేబియా సముద్రపు మ్యాప్!

దిశలతో సహా, డిగ్రీలతో సహా, ద్వీపాలతో సహా గీసివుంది పెన్సిల్‌తో. ఓచోట ఎర్రసిరాతో యింటు మార్క్ చేసి, దానిచుట్టూ గుండ్రంగా గీతగీసి 'బంబోసా' అని రాసివుంది.

"బంబోసా ఏమిటి?" అడిగేడు డేవిడ్ అర్థంకాక.

"స్టూడెంట్ లైఫ్‌లో నేను పుస్తకాల పురుగుని! ముఖ్యంగా సైన్సు గ్రంథాలమీదా, హిస్టరీ జాగ్రఫీ మీదా ఆసక్తి మెండుగా వుండేది. 'వరల్డ్ హిస్టరీ అండ్ జాగ్రఫీ' అనే గ్రంథంలో 'బంబోసా' గురించి చదివినట్టు జ్ఞాపకం వస్తోంది!

"బంబోసా, అరేబియా సముద్రంలోవున్న ఒక దీవి పేరు" అన్నాను సిగరెట్ అంటిస్తూ.

"ప్రపంచ మ్యాప్‌లో, సముద్రమందలి అతి చిన్న దీవులనుకూడా పొందుపరచడం జరిగింది. నాకు తెలిసినంత మటుకు ఆదీవి పేరు వరల్డ్ మ్యాప్‌లో యెక్కడా లేదే!" అన్నాడు విక్రమ్ ఆశ్చర్యంగా.

"నిజమే! ఆదీవి ప్రపంచ మ్యాప్‌లో మీకెక్కడా కనిపించదు. దాన్ని మ్యాప్‌లోంచి తొలిగించడం జరిగింది!"

"ఎందుకు?"

"అది అదృశ్యదీవి గనక!"

ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచారు ముగ్గురూ!

"అరేబియా సముద్రంలో ఒకచోట, సూర్యకిరణాలు ఒక విచిత్ర పరిణామానికి గురై వంగిపోతాయి, ఇంగ్లీషు

అక్షరం 'ఎల్' ఆకృతిలో! ఉదాహరణకి, నీళ్ళు నిండిన ఓ గాజుగ్లాసులో స్పూన్ వేసి చూడండి.

మన కంటికి స్పూన్ వంగిపోయినట్లు కనిపిస్తుంది. బంబోసాదీవి ప్రాంతంలో సూర్యకిరణాలు, సరిగ్గా ఇటు వంటి పరిణామానికే గురి అవుతాయి.

ఆ పరిణామం అక్కడ సంవత్సరానికి ఆరునెలలే ఉంటుంది. తరువాత సూర్య కిరణాలు మళ్ళీ యథాస్థితికి వస్తాయి. అంటే, నిటారుగా పడతాయన్నమాట! ఈ కారణంగా ఆదీవి ఆరునెలలు అదృశ్యమైపోతుంది!

అంటే, సూర్యకిరణాలు ఆరునెలలపాటు నిటారుగా పడటంవల్ల అది మనకంటికి కనిపించి, ఆరునెలలు వంగి పోవడంవల్ల కనిపించకుండా పోతుందన్నమాట! సముద్రంలో దీవిమాత్రం ఉన్నచోటే ఉంటుంది.

దీనికొక దృష్టాంతంకూడా ఉంది. ఒక చైనా యాత్రికుడు 1753 వ సంవత్సరం అక్టోబర్ నెలలో, అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తూ ఆ దీవిని చూసేడు. మొట్టమొదట అతను తన మ్యాప్‌లో అక్కడ దాని ఉనికిని తెల్పుతూ గుర్తులు పెట్టుకున్నాడు.

ఆరునెలల తరవాత, అతను మళ్ళీ ఆ దారినే తిరిగి వస్తే ఆ దీవి కనిపించలేదు!

ఆ తరవాత, 1768 మార్చి నెలలో, ఇంగ్లాండ్‌కు చెందిన రాబర్ట్ బ్రూస్ అనే నావికుడు సముద్ర దీవులను మ్యాప్‌లో పొందుపరచడానికి, అరేబియా సముద్రంలోకి ప్రవేశించేడు. అప్పుడతనికా దీవి కానవచ్చింది. మళ్ళీ ఆరునెలల తరవాత ఆ చుట్టుపక్కలకి వస్తే దీవి అదృశ్యం!

ఆనాటినించీ, ఆ మార్గాన ఓడల ప్రయాణాలను నిషేధించేరు. ఎందుకంటే ఆ దీవి అదృశ్యమై ఉన్న సమయంలో, ఆ మార్గాన ఓడలు ప్రయాణిస్తే దీవి గట్టుకు గుద్దుకుని తునాతునకలయ్యే ప్రమాదముంది మరి!

బహుశా నూరేళ్ళ క్రితం, మద్రాసు రేవునించి ఆ సముద్రంమీదుగా ఆస్ట్రేలియాకు ప్రయాణమైన సుందర రాజన్ ఓడ తుపాను తాకిడికి గురై, బంబోసా దీవివైపు వెళ్ళి, దాని గట్టుకు గుద్దుకుని తునకలై ఉంటుంది.

అదృష్టవశాత్తూ అతను బ్రతికి బైటపడి, ఆ దీవిలో ప్రవేశించి ఉంటాడు. అటువంటి విచిత్రమైన దీవిలో జన సాంద్రత ఉండే ప్రసక్తి లేదు. సుందరరాజన్ ఒక్కడే అక్కడి ఆకులలములు తింటూ, ఆ దారిన ఓడ లేవైనా వస్తాయేమోనని కాచుకునుంటాడు.

సముద్ర యానంలో ఆ మార్గం నిషేధించబడినప్పుడు, అతనికి సహాయం ఎట్లాఅందుతుంది? నిరీక్షణలోనే అతనా దీవిలో వందేళ్ళు గడిపివుంటాడు...''

''ఐతే, మళ్ళీ ఇక్కడికెలా జేరుకోగలిగేడు? ఇంత వయసు మీరినా, అంత బలంగా ఎలా వున్నాడు?'' అడిగేడు డేవిడ్.

''ఈ ప్రశ్నలకి సరైన జవాబులు అతనే ఇవ్వాలి. మనపరంగా ఆలోచిస్తే, అతనా దీవిలో ఆకులలములు తింటూ, స్త్రీ సాంగత్యంలేక ఏకాకిగా బ్రతికేడు. స్వచ్ఛమైన వాయువు పీల్చేడు.

అంతేగాక, ఆ దీవిలో మామూలు ప్రపంచంలో లేని చెట్లూ చేమలూ ఉండివుంటాయి. వాటిలో మనిషిని

దీర్ఘాయుష్కుడిగానూ, నిత్యయవ్వనుడిగానూ ఉంచే ప్రకృతిసిద్ధమైన రసాయనాలేవో నిండివుంటాయి.

నిత్యం వాటిని భుజించిన సుందరరాజన్, ఇప్పటికీ ఇలా చెక్కుచెదరకుండా ఉండివుంటాడు. పోతే, అతనిక్కడికి మళ్ళీ ఎలా రాగలిగేడు? ప్రదీప్ కుమార్ చక్రబర్తితో అతనికెలా పరిచయమైంది? మొదలైన ప్రశ్నలు ఊహాతీతంగా ఉన్నాయి."

"కొంపదీసి, ఈ పెట్టెలోని చూర్ణమే అతని దీర్ఘాయుస్సుకూ, నిత్య యవ్వనానికీ కారణం కాదుకదా?"

"ఔను. నాకూ అలాగే తోస్తోంది. లేకుంటే దీని కోసం వాళ్ళింత ఆర్భాటం దేనికి చేస్తారు? పరిస్థితులు తారుమారైన దృష్ట్యా ఇప్పుడు ప్రదీప్ కుమార్ చక్రబర్తి, తన సహచరులతో బంబోసా వెళ్ళబోతున్నాడు, ఈ చూర్ణంకోసం! మనం వెంటనే వెళ్ళి అతన్ని అతని మతాని పట్టుకోవాలి" అన్నాను లేస్తూ.

9

"అదుగో, బంబోసా!" అన్నాను హైనాక్యులర్స్ లోంచి కింద, సముద్రం మధ్య కనిపిస్తున్న దీవిని చూస్తూ.

నా పక్కనే, కాక్ పిట్ లో కూర్చున్న దేవిడ్ తొంగి చూసేడు కిందికి. దీవిపైన ఎగురుతోంది మా విమానం!

పైనించి దీవిమీద పచ్చనిచెట్లూ, ఇసుక తిన్నెలూ కొండరాళ్ళూ కనిపిస్తున్నాయి.

దీవి మొత్తంమీద, మనిషిమాత్రుడు కానరావడం లేదు.

"సార్! అటు చూడండి!" అన్నాడు డేవిడ్.

బైనాక్యులర్స్‌లోంచి చూసేను ఆవైపు. కొండరాళ్ళ నడుమ ఓ ఇసక తిన్నెమీద ఆగివుంది ఓ విమానం! నా అనుమానం నిజమే అయింది. చక్రబర్తి ముఠాను మేము పట్టుకోవడానికి వెళ్ళేలోగా వాళ్ళు తమస్వంత విమానంలో పరారయ్యారు. అనుమానంపై మేమూ ఈ దీవికి బయలుదేరాము.

"అది వాళ్ళ విమానమే అయుంటుంది. పైలెట్! మన ప్లేన్ని దీవి ఒడ్డున సముద్రంలో దింపెయ్" అన్నాను.

పైలెట్ తలూపి, దీవి చుట్టూ ఓ రౌండ్ - కొట్టించి మెల్లిగా దింపసాగేడు సముద్రంమీద.

ఐదు నిమిషాల తరవాత మా విమానం మోటర్ బోట్‌లా నీటిమీద తేలసాగింది. నైలాన్ తాళ్ళతో విమానానికి గట్టుమీది రాళ్ళతో లంగరువేసి, అవసరమైన వస్తువులు తీసుకుని, దీవిమీద అడుగుపెట్టాం.

చిత్రమైన థ్రిల్!

దూర దూరంగా ఎటుచూసినా నిర్మానుష్యం. అది వరకూ మేమెన్నడూ చూడని విచిత్రమైన చెట్లూ, చేమలూ కనిపిస్తున్నాయి. మాకు చేరువలోనే, కొండ రాళ్ళు కొరివి దెయ్యాల్లా నిలిచివున్నాయి.

"సార్! అటు చూడండి" అన్న డేవిడ్ కంఠం విని ఉలిక్కిపడి అటు చూసేను.

కొండరాళ్ళ మధ్య ఎవ్వరో కదులుతున్నట్లు లీలగా కనిపిస్తోంది. బైనాక్యులర్స్‌లోంచి పరీక్షగా చూసేను.

సుందరరాజన్!

అరచేతుల్ని గుండ్రంగా చుట్టి, కళ్ళదగ్గర పెట్టుకుని, బైనాక్యులర్స్‌లోంచి చూస్తున్నట్టు మమ్మల్ని చూస్తున్నాడు. అతను ఇక్కడ ఎందుకున్నాడో నాకు అంతుబట్టలేదు.

“ఢాం!” మన్న చప్పుడుతో కొండరాళ్ళు మారుమోగేయి.

మరుక్షణం, సుందరరాజన్ లేడిలా గెంతుతూ రాళ్ళలో మాయమయ్యేడు. ఆ చప్పుడు వినిపించినవైపు చూసేను. ఓ రాయి చాటున ప్రదీప్‌కుమార్ చక్రబర్తి ఒదిగి కనిపించేడు. అతని చేతిలో పిస్తోలు!

బహుశా, అతనే సుందరరాజన్ మీదికి పిస్తోలు పేల్చి ఉంటాడు. సుందరరాజన్ గురి తప్పి పారిపోవడంతో, ప్రదీప్‌కుమార్ మావైపు చూసి, మరుక్షణం రాళ్ళల్లో అదృశ్యమయ్యేడు.

“డేవిడ్! నువ్వు పైలెట్‌తో కలిసి, సుందరరాజన్ను వెతకండి. నేను ప్రదీప్‌కుమార్ని, అతని అనుచరుల్ని చూసుకుంటాను” అంటూ అటు పరుగుతీసేను.

ఓ బండ చాటున నక్కి, ఎక్కడైనా ఏ అలికిడైనా వినిపిస్తుందేమోనని చెవులు రిక్కించేను. నిశ్శబ్దం!

అడుగులో అడుగు వేసుకుంటూ ప్రదీప్‌కుమార్ పారిపోయినవైపు నడిచేను. కొద్ది దూరం వెళ్ళగానే ఎవ్వరో తగ్గుస్వరంలో గుసగుసలాడుకుంటున్నట్టు వినిపించి, చటుక్కున ఆగిపోయేను.

చుట్టూ రాళ్ళు అడ్డంగా ఉన్నాయి. కుడివైపునించి వినిపిస్తున్నాయి మాటలు. పిస్తోలు రెడీగా పట్టుకుని పిల్లిలా అడుగులు వేస్తూ అటు నడిచేను. ఎత్తైన రెండు రాళ్ళ నడుమ, మనిషి పట్టేంత ఇరుకు సందుంది!

ఆ సందుగుండా అవతలికెళ్ళానో లేదో, ప్రదీప్ కుమార్, వేలాయుధం కనిపించేరు! పరస్పరం మాట్లాడు కుంటున్నారు. సడన్ గా ప్రదీప్ కుమార్ దృష్టి నా మీద పడింది. మరుక్షణం అతని పిస్తోలు పొగలు కక్కింది. గుండు రయ్ మంటూ నా పక్కనించి దూసుకు పోయింది.

ఫైర్ చేశాక అతను మెరుపులా ఓవైపు దౌడు తీసేడు. అరక్షణంలో రాళ్ళమధ్య అదృశ్యమయ్యేడు ప్రదీప్ కుమార్!

వేలాయుధం పరిగెత్తుతూ, పరిగెత్తుతూ హఠాత్తుగా చేతులు పైకెత్తి, గావుకేక పెడుతూ అమాంతం నేలలో దిగిపోయేడు. ఆ దృశ్యం చూసి నిర్ఘాంతబోయేను. చూస్తూ చూస్తూనే చెట్టంత మనిషి అమాంతం నేలలో ఎలా మాయమయ్యేడు? అక్కడ రాతినేలతప్ప గొయ్యి లాటిదేమీ లేదే?

గబగబ అటు నడిచేను. పరీక్షగా చూసేను నేలని. అతను కూరుకుపోయిన చోట వెడల్పాటి గుండ్రని రాయి మిగతా రాతికంటే కాస్త ఎరుపు రంగులో కని పించింది.

సడన్ గా ఆలోచన వచ్చి చుట్టూ కలయచూసేను. చాలా బరువున్న ఓ రాయి అందుకుని, వేలాయుధం మాయమైన చోట ఎత్తేసాను. అంతే! రాయి అమాంతం నేలలోకి వెళ్ళిపోయింది. ఆ లిప్తపాటు వ్యవధిలో, ఆ చోట గుండ్రని పెద్ద సొరంగంలాటిది కనిపించి తిరిగి మూసుకుపోయింది.

నేను వేసిన రాయి బరువుతో అది కిందికెళ్ళి తిరిగి

మూసుకుంటున్నప్పుడు దానికింద బాగా చిలుముపట్టిన స్ప్రింగులున్నట్టు కిర్రుమనే చప్పుడు వినిపించింది!

మానవమాత్రుడు నివసించలేని ఈ అదృశ్యదీవిలో ఇటువంటి భూసొరంగాలుండటం ఎంత విచిత్రం!

ఇప్పుడు వేలాయుధం లోపల ఏమయ్యేడో చూడటం కన్నా ప్రదీప్ కుమార్‌ని వెదికి పట్టుకోవడం ముఖ్యం!

అంతక్రితం అతను పరిగెత్తినవైపు నడిచేను.

ఓ చోట బండలమధ్య చిన్న సెలయేరు పారుతోంది. నీటిలో తడసిన బూట్సు ముద్రలు అవతలివైపు వెళుతున్నాయి.

ఒక్క జంపులో అవతలి గట్టుమీదికెళ్ళాను. ఆ గుర్తుల్ని చూసుకుంటూ ముందుకి నడిచేను. కొద్ది దూరం వెళ్ళి అడుగుజాడలు ఆగిపోయేయి. అక్కడ సరిగ్గా వేలాయుధం పడిపోయిన చోట ఉన్నట్టే వెడల్పాటి గుండ్రని ఎరుపురాయి కనిపిస్తోంది.

అంటే, అటువంటి సొరంగ మార్గమే అక్కడకూడా వుందన్నమాట! కింద కూర్చుని పరిశీలిస్తున్నాను. వెనక ఏదో చప్పుడైంది. గిరుక్కున వెనుదిరిగాను.

సుందరరాజన్!

"ఈ సొరంగ మార్గాలు నిర్మించింది నేనే ఇన్‌స్పెక్టర్! ఇప్పుడు నాకు మీ సహాయం కావాలి. ఆ నీచుడు ప్రదీప్ కుమార్‌ని, వాడి అనుచరుల్ని నేనొక్కణ్ణే లొంగదీయలేననిపిస్తోంది" అన్నాడు చాలా నింపాదిగా. అతని చేతిలో పిస్తోలు వుంది.

నవ్వేను. "నువ్వు ముందే మాతో చేతులు కలిపి వుంటే పరిస్థితి ఇంతదూరం వచ్చేదికాదు మిస్టర్ సుందర

రాజన్! ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు.

నాకు అర్థంకాని విషయమల్లా మీకూ, ప్రదీప్ కుమార్‌కూ పరిచయమెలా కలిగింది? వందేళ్ళు ఇక్కడ గడిపిన మీరు హఠాత్తుగా మద్రాసెలా చేరుకున్నారు?'' అడిగేను.

సుందరరాజన్ చిన్నగా నవ్వి ''అదొక కథ! ప్రదీప్ కుమార్ ఇంటర్నేషనల్ స్మగ్లర్ అని మీకు తెలుసుగా? ఒక సారతను తన విమానంలో ఈ దీవి మీదుగా వెళుతూ విమానం ఇంజన్ ట్రబులివ్వడంవల్ల దిక్కుతోచక విమానాన్ని దీవిలో దింపేసేడు.

నూరేళ్ళనించీ అటువంటి సంఘటనకోసమే తహతహలాడుతున్న నాకు, అతన్ని చూడగానే పట్టరాని ఆనందం కలిగింది. రెండు మూడు రోజులు నాతో బాటతనిక్కడే గడిపేడు.

ఈ దీవిలో ఒక విచిత్రమైన ఆకు వుందనీ, దాన్ని తినడంవల్లే నేనిలా ఉన్నాననీ, నన్ని దీవినించి మద్రాసు చేరిస్తే అతనికా ఆకు చూర్ణం కొంత ఇస్తాననీ, దాన్ని ధనవంతులకమ్మి కుబేరులం కావచ్చనీ చెప్పేనతనికి.

దానికతను వెంటనే ఒప్పుకున్నాడు. ఇద్దరం కలిసి విమానాన్ని బాగుచేసుకుని, పెద్ద మొత్తంలో ఆ ఆకు చూర్ణాన్ని మూటగట్టుకుని మద్రాసు చేరుకున్నాం.

అక్కడికెళ్ళగానే వాడిలో దురాశ మొలకెత్తింది. ఆ చూర్ణాన్ని అంతా కాజేసి తానొక్కడే డబ్బు చేసుకోవాలని ప్లాన్ వేసేడు. నేనతని దురుద్దేశాన్ని వెంటనే పసిగట్టి చూర్ణాన్ని డబ్బాలో ప్యాక్ చేసి బొంబాయి వెళ్ళిన నా ముని మనమరాలు జనప్రియకు పంపేను...''

"ఇప్పుడు తీరింది నా సందేహం! రండి ప్రదీప్ కుమార్ ఈదారినే కిందికెళ్ళుంటాడు. ఆలస్యం చెయ్యకూడదు. వాణ్ణి పట్టుకోవడానికిదే మంచి అవకాశం!" అంటూ కిందున్న పలకరాతిని గట్టిగా వత్తేను.

రాయి కిర్రుమంటూ కిందికెళ్ళింది. మెట్లు కనిపించేయి. జాగ్రత్తగా లోనికి దిగేను. నా వెనుకే సుందరరాజన్ దిగివచ్చేడు. లోపల చిమ్మచీకటి!

"ఎంత చీకటున్నా ఈ మార్గాలు నాకు కొట్టిన పిండి! రండి నావెనక!" అంటూ ముందుకు నడిచేడు సుందరరాజన్.

తడుముకుంటూ అతన్ననుసరించేను. ఓ చోట మలుపుంది. మలుపు తిరగబోయాం, అంతే! మా తలలమీద "ఠక్, ఠక్" మంటూ పడ్డాయి దెబ్బలు.

మెడలు నరికిన చెట్లలా కిందకూలాం!

10

తిరిగి కళ్ళు తెరిచిచూస్తే, ఓ గుహలాంటి గదిలో నేలమీద పడున్నాను. లోపల కొవ్వొత్తి వెలుగుతోంది. చేతులు వెనక్కి విరిచి కట్టివున్నాయి. నా పక్కనే సుందరరాజన్, డేవిడ్, పైలెట్ కూడా పడున్నారు అదే స్థితిలో.

మా చుట్టూ ప్రదీప్ కుమార్, వేలాయుధం అతని అనుచరులూ నిల్చున్నారు ఆయుధాలు పట్టుకుని. మేము కళ్ళు తెరవగానే ప్రదీప్ కుమార్ కంఠం ఖంగుమంది.

"మిస్టర్ సుందరరాజన్! నీవీ గుహల్లో దాచిన ఆ చూర్ణాన్ని మర్యాదగా మా కప్పగించు మిమ్మల్ని విడిచి పెడతాను. లేదా చిత్రహింసలు పెట్టి ఇక్కడే చంపేస్తాం!"

సుందరరాజన్ పలకలేదు. కాసేపు ఆలోచించి, ఏమనుకున్నాడో ఏమో, సాలోచనగా తలూపేడు. "సరే మీచేత చిత్రహింసలు పడేకంటే దాన్నిచ్చేసి, ప్రాణాలు దక్కించుకోడమే మేలు. ఈ గుహ కుడివైపు వెళితే నాలుగో గుహ వస్తుంది. అందులో ఒక రహస్య గది వుంది. ఆ గదిలో దాచేను ఆ చూర్ణాన్ని!"

"వెరీగుడ్! మా వెంటవచ్చి చూపించు ఆ రహస్య గది ఎక్కడుందో? లేవండి మీరంతా!" అన్నాడు ప్రదీప్ కుమార్ మమ్మల్ని ఆదేశిస్తూ.

లేచి నిల్చున్నాం అందరం!

"సుందరరాజన్! నువ్వు ముందుండి దారి చూపించు" అన్నాడు ప్రదీప్ కుమార్ టార్చిలైటు వెలిగిస్తూ.

సుందరరాజన్ మౌనంగా గుహ ద్వారంవైపు నడిచేడు. మా అందరి చేతులూ వెనక్కి విరిచి కట్టివున్నాయి. మౌనంగా సుందరరాజన్ని అనుసరిస్తున్నాం. ప్రదీప్ కుమార్ అనుచరులు ఆయుధాలతో మమ్మల్ని అనుసరిస్తూ రాసాగేరు.

ఇరుకైన దారిగుండా రెండు మూడు మలుపులు తిప్పి ఓ చోట ఆగేడు సుందరరాజన్. అక్కడ దారి సమాప్తం కాని, గోడలో రాతి తలుపు మూసివున్నట్టు కనిపిస్తోంది. ఆ తలుపు కడ్డంగా పొడవాటి ఇనప వస్తువేదో బిగించివుంది గోడలో.

"ఆ ఇనప కడ్డీ తొలగించి కొక్కెంపట్టి లాగితే, రాతి తలుపు తెరుచుకుంటుంది. ఆ గదిలోనే వున్నాయి చూర్ణం రాసులు!" అన్నాడు సుందరరాజన్.

"ఆల్ రైట్! ఇక మీరు వెనక్కి జరగండి"

అంటూ టార్చిలైటు వేలాయుధం చేతికిచ్చి మమ్మల్ని తప్పుకుంటూ ఆ తలుపుని సమీపించేడు ప్రదీప్ కుమార్. అందరం కాస్త వెనక్కి జరిగి చూస్తూ నిల్చున్నాం.

ప్రదీప్ కుమార్ తలుపు కడ్డంగా బిగించివున్న ఆ పొడవాటి ఇనపవస్తువు మీద చెయ్యివేసి లాగేడు. అంతే!

"ఖణేల్ !" మన్న చప్పుడు.

ప్రదీప్ కుమార్ చక్రబర్తి తల ఎగిరిపోయింది! తలలేని మొండెంలోంచి ఫౌంటేన్ లా విరజిమ్మసాగింది రక్తం!!

కలలో కూడా ఊహించని ఆ సంఘటనకు నిశ్చేష్టుడ నయ్యేను. ప్రదీప్ కుమార్ మొండెం మొదలు నరికిన చెట్టులా దభీమంటూ పడిపోయింది కింద! చేతులు టప టప లాడినూ.

పక పక నవ్వుతూ మావైపు తిరిగేడు సుందరరాజన్.

"ఆ చూర్ణం రక్షణకోసం నేను జేసిన ఏర్పాటే ఇది! కత్తివంటి పదునైన ఇనపచట్టాను స్ప్రింగుల సహాయంతో బిగించేను తలుపు కడ్డంగా. దాన్ని లాగిన మరుక్షణం ఖడ్గంలా రివ్వునవచ్చి తలని ఎగరగొడుతుంది! ఈ నీచుడు తన దురాశకు తగ్గ ఫలితం అనుభవించేడు" అంటూ వేలాయుధం వైపు తిరిగేడు సుందరరాజన్.

ప్రదీప్ కుమార్ చక్రబర్తి గతి కళ్ళారా చూసిన ఆ రౌడీలు, అప్పటికే చమట్లు కక్కుతూ, గజ గజ వణుకు తున్నారు.

"వేలాయుధం! నీ బాస్ గతి చూశావుగా? నేనీ సొరంగాల్లో ఇటువంటి ఏర్పాట్లెన్నో చేసివుంచాను. మీకు ప్రాణాలమీద ఆశవుంటే మా కట్లు విప్పి, సుర

క్షేమంగా మాతో మద్రాసు రావచ్చు లేదా ఇక్కడే ఇక్కడా చావండి!'' అన్నాడు సుందరరాజన్ కటువుగా.

వేలాయుధం విధిలేక "వారి కట్లువిప్పండి!''అన్నాడు తన అనుచరులతో.

మరుక్షణం మమ్మల్ని బంధవిముక్తుల్ని జేశారు వాళ్ళు. సుందరరాజన్ గోడలోవున్న ఆ రాతి తలుపు తెరిచేడు లోపల చిన్న చిన్న రాసులుగా పేర్చివుంది ఆకు పచ్చని చూర్ణం!

ఆ చూర్ణాన్ని లాబొరేటరీలో పరీక్షలు జరిపించడానికి మా వెంట కొంత తీసుకుని సొరంగ మార్గాలగుండా బైటికి వచ్చాం. దీవి ఒడ్డున సముద్రంలో తేలుతున్న విమానం ఎక్కాం.

విమానం పైకెగురుతున్న కొద్దీ, కింద సముద్రం నడుమ ఒంటరిగా ఏకాంతంగా వెలవెలబోతూ కనిపించ సాగింది ఆ అదృశ్యదీవి!

—: ఐపోయింది :—